క్లుప్తంగా

సీడీపీఓగా సుచిత్ర బాధ్యతల స్వీకరణ



రేపల్లె రూరల్: సీడీపీఓగా సుచిత్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వేటపాలెంలో సీడీపీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీపై రేపల్లె వచ్చారు. రేపల్లె సీడీపీఓగా విధులు నిర్వర్తించిన సూపర్‌వైజర్ మాణిక్యం యథాస్థానానికి వెళ్లారు. ఈ సందర్భంగా సీడీపీవో సుచిత్ర మాట్లాడుతూ మాత, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు. తొలుత సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది సుచిత్రకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పిట్టలవానిపాలెం హౌసింగ్ ఏఈగా పద్మావతి



కర్లపాలెం: పిట్టలవానిపాలెం హౌసింగ్ ఏఈగా పద్మావతి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె చెరుకుపల్లి ఏఈగా పనిచేస్తూ బదిలీపై పిట్టలవానిపాలెం వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన ప్రసాద్ బాపట్లకు బదిలీ అయి వెళ్లారు.

పంచాయతీ కార్యదర్శులు బదిలీ

వేమూరు: వేమూరు మండలంలోని పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారని ఎంపీడీఓ బి.శివన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనుమర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరరావును చుండూరు మండలంలోని చినగాదెలవర్రు గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో బలిజేపల్లి పంచాయతీ కార్యదర్శి నూతక్కి సింధూ పెనుమర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. చావలి పంచాయతీ కార్యదర్శి గాజులు శ్రీనివాసరావును పెరవలి గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. చదలవాడ పంచాయతీ కార్యదర్శి షేక్ సాధీఖాన్‌ను కుచ్చెళ్ల పాడు గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. చదలవాడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా అంజనేయులు ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. వరహాపురం పంచాయతీ కార్యదర్శి సుజాత పెరవలి పాలెం పంచాయతీ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆమె ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వరహాపురం పంచాయతీ కార్యదర్శిగా గోపాల కృష్ణ బాధ్యతలు చేపట్టారు. జంపని పంచాయతీ కార్యదర్శి వివేక నంద్‌ను దుగ్గిరాల బదిలీ చేశారు. జంపని పంచాయతీ కార్యదర్శిగా షేక్ రహిమాన్ బాధ్యతలు చేపట్టారు.

కర్లపాలెం కార్యదర్శిగా సునీత



కర్లపాలెం: మేజర్ పంచాయతీ కర్లపాలెం కార్యదర్శిగా సునీత సోమవారం ఉద్యోగ భాధ్యతలు చేపట్టారు. కార్యదర్శి సునీతకు గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి శాలువా కప్పి పూలమాల వేసి చిరు సన్మానం చేశారు. సునీత యాజలి గ్రామ పంచాయతీ నుంచి బదిలీపై కర్లపాలెం వచ్చారు. చింతాయపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రాజశేఖర్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టగా సర్పంచ్ పీతా శ్రీనివాసరావు అతనిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



భట్టిప్రోలు: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం ప్రకారం మండలంలోని వెల్లటూరు గ్రామంలో నివసిస్తున్న వెలగపూడి హర్ష (35) ఆదివారం రాత్రి నీటి మోటార్ స్విచ్ బోర్డు వేసే క్రమంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. అతని భార్య జ్యోత్స్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. హర్షకు ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి స్వగ్రామం పెదపులివర్రు.

వరద బాధిత కుటుంబాలకు దోమతెరలు పంపిణీ



కొల్లూరు : వరద ప్రభావిత లంక గ్రామాలలో నిల్వ ఉన్న నీరు కారణంగా దోమల విజృంభణ అధికంగా ఉన్న నేపథ్యంలో దాతలు దోమతెరలు పంపిణీ చేశారు. మండలంలోని జువ్వలపాలెం శివారు కొత్తగూడెంలో సోమవారం 104 కుటుంబాలకు చుండూరు మండలం వలివేరుకు చెందిన దాతలు పందిపాటి రెడ్డయ్య, కొండమూది చింపిరయ్య, పులివర్తి సుధీర్, కొండమూది ఎనోష్, కొండమూది ప్రసాద్, అమర్తలూరి చిన్నచిట్టిలు తమవంతు సహకారంగా దోమతెరలు అందజేశారు.

పార్కులు.. రిమార్కులు

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- ఆటవస్తువులు శిథిలం
- నిర్వహణ అస్తవ్యస్తం

రేపల్లె రూరల్: పట్టణంలోని పార్కులు అధికారుల నిర్లక్ష్యం వల్ల కునారిల్లుతున్నాయి. ఫలితంగా ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆహ్లాదం కోసం ఉద్యానవనాలకు వెళ్తే కనీస వసతులు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల ఆటవస్తువులు శిథిలమైనా, పెద్దలు కూర్చునే బల్లలు విరిగిపోయినా మున్సిపల్ అధికారులకు పట్టడం లేదు.

రూ.10 లక్షలతో అంబేడ్కర్ పార్కు అభివృద్ధి

గత సంవత్సరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్క్‌ను రూ.10 లక్షల రూపాయలతో అభివృద్ధి చేసి అన్ని రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. చంద్రమౌళి పార్కులోని ఆట వస్తువులు శిథిలమై ఉండడంతో పట్టణంలోని చిన్నారులు అధిక సంఖ్యలో అంబేడ్కర్ పార్కుకు వెళ్తున్నారు. అయితే నిర్వహణ లోపం వల్ల అక్కడ కూడా ఆటవస్తులు పాడైపోయాయి. కొన్ని శిథిలమైన ఆటవస్తువుల వల్ల చిన్నారులు గాయపడుతున్నట్టు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చంద్రమౌళి పార్కులో మాయమైన ఉయ్యాలలు



చంద్రమౌళి పార్కులో విరిగిపోయిన ఆటవస్తువులు

అధ్వానంగా చంద్రమౌళి పార్కు

సుమారు ఆరు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రేపల్లె పట్టణంలో నాలుగు పార్కుల వరకు ఉన్నాయి. ప్రధాన రహదారిలో చంద్రమౌళి పార్కు, అంబేడ్కర్ పార్కులు ఉండగా, హౌసింగ్ బోర్డు కాలనీలో ఒక పార్కు, ఉప్పూడి రోడ్డులో మరో పార్కు ఉన్నాయి. వీటిలో చంద్రమౌళి పార్కు పూర్తి అధ్వాన్నంగా మారింది. ఇక్కడ ఆటవస్తువులు శిథిలమయ్యాయి. అంబేడ్కర్ పార్కులోనూ ఇదే దుస్థితి. ఊయలలు, జారుడు బండలు, రంగురాట్నాలు పాడైపోయాయి. ఉప్పూడి రోడ్డులోని పార్కులోనూ, హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కులోనూ శిథిల ఆటవస్తువులు దర్శనమిస్తున్నాయి.



పగిలిపోయిన జారుడు బల్ల



శిథిలమైన జారుడుబల్ల

పార్కులను తీర్చిదిద్దుతాం



చంద్రమౌళి పార్క్, ఇతర పార్కుల్లోని ఆట వస్తువులు శిథిలావస్థకు చేరుకున్న అంశం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. ఆ ఆట వస్తువులను తొలగించి కొత్త వస్తువులను సమకూర్చేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం. త్వరలోనే నూతన ఆట వస్తువులను చిన్నారులకు అందుబాటులో ఉంచుతాం. పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతాం.

– సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె



చంద్రమౌళి పార్కులో శిథిలావస్థకు చేరిన జారుడు బల్లలు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

బాపట్లటౌన్: ప్రజలకు బ్యాంకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. పట్టణంలోని ఏంజీ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ శాఖను సోమవారం జేసీ ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సకాలంలో రుణాలు అందించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే, బ్యాంక్ మాజీ చైర్మన్ ఎం.అంజనేయులు మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. 2025 మార్చి నాటికి తమ బ్యాంక్ 8,000 కోట్ల లక్ష్యంగా డిపాజిట్లు సేకరణ ఉంటుందన్నారు. రూ.100 కోట్ల రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్ దేశంలోనే 3వ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో వాణి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఫెడరేషన్ డైరెక్టర్ ఎం.వెంకటరత్నం, ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్.రంగరాజు, జిల్లా సహకార అధికారి సి.హెచ్.శ్యామ్సన్, గుంటూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ది ఏలూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఏలూరు గురవయ్య పాల్గొన్నారు.



బాపట్లలో విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జేసీ ప్రఖర్ జైన్

చేనేత కార్మికులను ఆదుకోవాలి

భట్టిప్రోలు: ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల మగ్గాల గుంతల్లో నీరు చేరి ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు జి.బాలాజి, ఎం.సత్యనారాయణలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద చేనేత కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బాలాజి, సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు మంగళగిరి తరహాలో ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులు అందించి ఆదుకోవాలని కోరారు. నేతన్నలు 20 రోజులకుపైగా పనులు లేకపోవడంతో రోజులు గడవక, కష్టాలను ఎదుర్కోవడంతోపాటు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. బాపట్ల జిల్లాను ముంపు జిల్లాగా ప్రకటించిన ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవడంలో ఎందుకు తాత్సారం చేస్తోందని ప్రశ్నించారు. తక్షణమే నేతన్నలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్వీ రమణలకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘాల నాయకులు డి.సత్యనారాయణ, బి.నాగమల్లేశ్వరరావు, కె.రామకోటేశ్వరరావు, డి.సాంబశివరావు, జె. నాగభూషణం, కె.చలపతి రావు, ఎ.శ్రీనివాసరావు, లక్ష్మీకాంతారావు, రామ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో వినతి పత్రం అందచేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.ప్రసాద్ తెలిపారు. రేపల్లె రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. వివిధ సమస్యలపై ఆరు అర్జీలు అందాయని వివరించారు. ఇదిలా ఉంటే రేపల్లె డివిజన్‌ను రవాణా, భౌగోళికపరంగా అన్నివిధాలుగా సానుకూలంగా ఉండే తెనాలి డివిజన్‌లో విలీనం చేయాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు

వార్డు మెంబర్లకు శిక్షణ

అమర్తలూరు(వేమూరు): పంచాయతీల ద్వారా సుపరిపాలన అందాలనే సదుద్దేశంతో వార్డుమెంబర్లు, ఉపసర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీఓ శేషమాంబ చెప్పారు. అమర్తలూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర మాట్లాడుతూ వార్డు మెంబర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం 40 మంది వార్డుమెంబర్లు శిక్షణ పొందారు. చుండూరు మండల పరిషత్ కార్యాలయంలోనూ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇచ్చారు.



అమర్తలూరులో వార్డుమెంబర్లకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో శేషమాంబ

గోవులను రోడ్లపైకి వదిలితే చర్యలు

రేపల్లె రూరల్: రహదారులపైకి గోవులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. రహదారులపైకి ఆవులు రావటంతో ట్రాఫిక్‌తోపాటు పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోందన్నారు. గోవులు ప్రమాదాల బారిన పడుతున్నాయని, గోవులు రహదారిపైకి వస్తే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గోశాలకు తరలిస్తామని యజమానులను హెచ్చరించారు. పలువురు యజమానులకు నోటీసులు జారీ చేశారు.

పాలవ్యాన్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నిజాంపట్నం: పాలవ్యాన్ ఢీకొని ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన నిజాంపట్నంలో సోమవారం జరిగింది. నిజాంపట్నం గ్రామానికి చెందిన గంగుల చిన్న మీరయ్య ఉదయాన్నే చేను చూసి వద్దామని నిజాంపట్నం నుంచి రేపల్లె వైపు తన స్కూటీపై వెళ్తుండగా రేపల్లె నుంచి నిజాంపట్నం వస్తున్న పాల వ్యాన్ గురుకుల పాఠశాల సమీపం ఢీకొంది. దీంతో మీరయ్య స్కూటీతో సహా కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు నిజాంపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రుని మెరుగైన వైద్యసేవల కోసం తెనాలి వైద్యశాలకు తరలించారు.

బదిలీ అయిన సిబ్బందికి సన్మానం



పెనుమర్రు(వేమూరు) పెనుమర్రు గ్రామ సచివాలయం నుంచి బదిలీపై వెళ్లిన సిబ్బంది గ్రామ అభివృద్ధికి కృషి చేశారని గ్రామ సర్పంచ్ కొక్కిల గడ్డ సుమతి అన్నారు. వేమూరు మండలంలోని పెనుమర్రు గ్రామ సచివాలయంలో పని చేసి బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరరావు, వీఆర్‌ఓ గాజుల జితేంద్ర, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ లైన్‌మెన్ పుసులూరు మనోజ్ కుమార్‌కు ఆమె సోమవారం సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల కోసం కృషి

రేపల్లె రూరల్: స్వచ్ఛ గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ శోభారాణి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సోమవారం పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆమె మాట్లాడారు. ఉపసర్పంచ్, వార్డు మెంబర్ల విధులను వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో అరవపల్లి, బొందలగరువు, బేతపూడి, చాట్రగడ్డ, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, గుడ్డికాయలంక, కైతేపల్లి, కారుమూరు, కామరాజుగడ్డ నార్త్, సౌత్, లంకెవానిదిబ్బ, మోళ్ళగుంట, మోర్లవారిపాలెం గ్రామాల ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీడీఓ శోభారాణి తదితరులు

ప్రభుత్వ అసమర్థత వల్లే మహిళలపై దాడులు

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

రేపల్లె రూరల్: కూటమి ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్రంలో మహిళలు, యువతులకు భద్రత కరువైందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రేమోన్మాది దాడిలో గాయపడి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలిక, ఆమె తల్లిదండ్రులను సోమవారం సాయంత్రం రమాదేవి పరామర్శించి ధైర్యం చెప్పారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ వైద్యశాల వద్ద నిరసన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. పుంగనూరులో బాలికను దారుణంగా హతమార్చినా ప్రభుత్వం స్పందించకపోవటం విచారకరమన్నారు. కనగాల ఘటనలో నిందితులను ఇప్పటి వరకు గుర్తించకపోవటం పోలీసుల అసమర్థతేనన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్, నాయకులు వెంకట్రామయ్య, రమేష్, ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్యశాల వద్ద నిరసన తెలుపుతున్న రమాదేవి, సీపీఎం, ఐద్వా నాయకులు

రుణాల చెల్లింపునకు తాత్కాలిక మినహాయింపు ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమాదేవి

కొల్లూరు : వరదల వల్ల నష్టపోయిన పేద కుటుంబాలకు రుణాల చెల్లింపులో తాత్కాలిక మినహాయింపు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పోతార్లంకలో వరద బాధిత కుటుంబాలకు సీపీఎం ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన జీఎస్సార్ విద్యా సంస్థల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ వరదల వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. వారిని ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు రుణాల చెల్లింపునకు వెసులుబాటును ఇవ్వాలని కోరారు. వరదల వల్ల ఈ ప్రాంతంలో పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం పనులు చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమె జీఎస్సార్ విద్యా సంస్థలు సమకూర్చిన రూ. 2 లక్షలు విలువైన నిత్యావసర సరుకులను బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ గోగినేని సాంబశివరావు, తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్, సీపీఎం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, బొనిగల సుబ్బారావు, పంతగాని నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమాదేవి



భట్టిప్రోలు మండలం వెల్లటూరులో లలితా దేవి అలంకారంలో కట్లమ్మ

మహాదేవీ నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు సోమవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులను కటాక్షించారు. కొన్నిచోట్ల మహాచండీగా కరుణించారు. అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని భక్తులు కనులారా వీక్షించి పులకించారు.

– భట్టిప్రోలు/వేమూరు/నగరం/రేపల్లె రూరల్:



భట్టిప్రోలు మండలం వెల్లటూరులో మహచండీ అలంకారంలో కనకదుర్గమ్మ



చుండూరు మండలం చినపరిమి గ్రామంలో చండికా దేవి అలంకరణ



నగరం మండలం కొలగానివారిపాలెంలో మహాచండీదేవి అలంకరణలో అమ్మవారు



రేపల్లెలో ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న గ్రామదేవత బూరుగులమ్మ

ట్రాక్టర్ ట్రక్కు ఢీకొని ఇద్దరికి గాయాలు

కర్లపాలెం: ద్విచక్ర మోటారు వాహనాన్ని ట్రాక్టర్ ట్రక్కు ఢీకొనటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన దమ్మనవారిపాలెం గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బిడారుదిబ్బ గ్రామానికి చెందిన కంచర్ల చెంచయ్య తన తల్లి కటాక్షంతో కలిసి ద్విచక్ర మోటారు వాహనంపై ఖాజీపాలెం వెళ్తుండగా ఖాజీపాలెం నుంచి యాజలి వస్తున్న ట్రాక్టర్ ట్రక్కు ద్విచక్ర మోటారు వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో చెంచయ్య, కటాక్షం రోడ్డుపై పడ్డారు. ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వారిద్దరూ చికిత్స పొందుతున్నారు.

ఆదర్శ మండల మహిళా కార్యాలయం మూత

వేమూరు: ఆదర్శ మండల మహిళా కార్యాలయం మూతపడింది. ఈ కార్యాలయంలో ఐదుగురు ఉద్యోగులు ఉండాలి. ఏపీఓ, ముగ్గురు సీసీలు, అకౌంటెంట్ విధులు నిర్వర్తిస్తారు. సోమవారం ఈ కార్యాలయం మూతవేశారు. డ్వాక్రా గ్రూపుల సభ్యులు వచ్చి తిరిగి వెళ్లారు. ఏపీఎం శోభన్‌బాబును వివరణ కోరగా సిబ్బంది కొరత వల్ల మూతవేసినట్టు చెప్పారు.

